క్లుప్తంగా

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఆసిఫ్ అలీ

కడ్తాల్: రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ అలీ ఆధ్వర్యంలో.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని 76 మసీదుల్లో మౌజన్, ఇమామ్, హాఫేజ్‌కు రంజాన్ కిట్లను అందించామన్నారు. రంజాన్ కిట్లలో దుస్తులతో పాటు, టోపీలు, అత్తరు, సుర్మ, తజ్బీ, మహెరుమా తదితర వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే కడ్తాల్‌లోని ముస్లిం సోదరులకు మిత్రమండలి ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను అందిస్తామన్నారు.

అంగన్‌వాడీలో స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో చిన్నారులు

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. చక్కగా అభినయం చేస్తూ ఆటపాటలతో నృత్యరూపకంగా బోధించారు. చిన్నారుల బోధన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, అంగన్‌వాడీ టీచర్ పద్మ, సర్పంచ్ హైమావతి, నాయకులు.. రామస్వామి, సత్యంగౌడ్, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం: యూటీఎఫ్



జెండావిష్కరణలో యూటీఎఫ్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జెండాను మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఆంజనేయులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైనా జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి భగవంత్‌రాజ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నేనావత్ శ్రీను, పాండునాయక్, శ్రీనివాసులు, వెంకటస్వామి, రామ్‌జీ, రామ్‌చందర్, యాదగిరి, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించండి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు

తలకొండపల్లి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం అక్షరాభ్యాసం కార్యక్రయం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌యాదవ్ చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల, సృజనాత్మకత పెంపొందించేందుకు అంగన్‌వాడీలు కృషిచేస్తున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీలో పంపిణీ చేసే పోషకాహారాన్ని పిల్లలకు తినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సక్కుబాయి, కార్యదర్శి శరత్‌కుమార్, టీచర్లు భూషనమ్మ, నస్రీన్, వసంత, లక్ష్మి, విజయ, ఏఎన్ఎం సువర్ణ, సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోన్ జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం జెడ్సీని కలిసిన ఆయన వెంకటరమణ కాలనీ, పద్మావతి కాలనీ, శక్తినగర్, అనురాధ కాలనీ, హిల్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌ల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలాజీనాథ్, నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లోనూ రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మహనీయుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మహనీయుల జ్ఞాపకార్థం.. అంబేడ్కర్ యువజన సంఘాల మండల అధ్యక్షుడు సిద్దిగారి దాస్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి క్రికెట్ టోర్నీని నిర్వహించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పోటీలను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని.. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు రవి, జగన్‌యాదవ్, మహేశ్, అంజి, రాజేశ్, పాండునాయక్, రవి, క్రీడాకారులు ఉన్నారు.

గౌడసంఘం భవన నిర్మాణానికి కృషి

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న గౌడ సంఘం భవన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషిచేస్తానని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గౌడ సంఘం సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. గౌడ సంఘ భవన నిర్మాణం నిధులు లేక అసంపూర్తిగా ఉందని.. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరించాలని ఆ సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గౌడ సంఘం భవన నిర్మాణం కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.2లక్షల ప్రొసీడింగ్‌ను ఆ సంఘం నాయకులకు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్ పాండునాయక్, గౌడసంఘం నాయకులు యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఊరెళ్తుంటే సమాచారం ఇవ్వండి



సీఐ ఉపేందర్

ఆమనగల్లు: నేరాలు అదుపుచేయడానికి పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆమనగల్లు సీఐ ఉపేందర్ కోరారు. ఆమనగల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ ఉపేందర్ మాట్లాడారు. వేసవికాలంలో దొంగతనాలు నివారించడానికి సైబరాబాద్ పోలీసులు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సీఐ చెప్పారు. వేసవి సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని లేదంటే ఇంట్లో రహస్య ప్రదేశంలో పెట్టాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం గల తాళం అమర్చుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. వాహనాలను ఇంట్లో పార్కింగ్ చేసి తాళాలు వేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని కోరారు. సీసీ కెమెరాలను సెల్‌ఫోన్లకు అనుసంధానం చేసి పర్యవేక్షించాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్తే సోషల్ మీడియాలో ఆ విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం సరైంది కాదు. నమ్మకమైన ఇరుగుపొరుగువారికి ఇంట్లో మీరు లేని సమయంలో ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పండి. అత్యవసర సమయంలో 100కి డయల్ చేయండి.

దిమ్మె కూల్చివేతపై ఆందోళన



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ దిమ్మె కూల్చివేతపై గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన వారు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి దిమ్మెను నిర్మించారు. అయితే ఈ దిమ్మెను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చేశారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి రోజు ఆయన విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తుండగా.. కావాలనే కొందరు దిమ్మెను కూల్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ కాలె సంతోషను సంప్రదించగా అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ విషయంలో గ్రామంలోని మాదిగ, మాల వర్గాల్లో వివాదం తల్లెత్తినట్లు.. త్వరలో గ్రామస్తులతో సమావేశమై గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఆమె తెలిపారు. సర్పంచ్ హామీతో ఆందోళనకారులు శాంతించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

కడ్తాల్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం రాజేశ్వరి సూచించారు. మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ 2.0లో భాగంగా గురువారం 'ఆర్థిక అక్షరాస్యత-డిజిటల్ లావాదేవీలు' అనేం అంశంపై స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో మెజార్టీగా.. డిజిటల్ లావాదేవీల ద్వారా నగదు జమచేయడం, బదిలీ చేయడం, బీమా సదుపాయాలు, చెల్లింపులు, బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని.. తెలిపారు. అదే విధంగా జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. అంతకు ముందు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చాంధీ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, బ్యాంకు అధికారులు, సీసీలు ఉన్నారు.

మహేశ్వరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీపీ రఘుమారెడ్డి తదితరులు

- మంత్రి సబితారెడ్డి
- మన్సాన్‌పల్లి – కోళ్లపకడల్ రోడ్డుకు రూ. 15.20 కోట్లు మంజూరు
- కృతజ్ఞతలు తెలిపిన ఎంపీపీ రఘుమారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

మహేశ్వరం: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మన్సాన్‌పల్లి – కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాలను కలిపే బీటీ డబుల్ రోడ్డు పనులకు మంత్రి రూ. 15.20 కోట్లు మంజూరు చేశారు. దీంతో గురువారం ఎంపీపీ కే రఘుమారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు మంత్రిని నగరంలోని ఆమె నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం గేటు నుంచి మహేశ్వరం వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. శ్రీశైలం జాతీయ రహదారి తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం పట్టణం వరకు రూ. 14 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, తండాల రోడ్లకు రూ. 9.41 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాగారం – కోళ్లపడకల్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులకు రూ. 15 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతానికి పలు పరిశ్రమలు వచ్చాయని, భవిష్యత్తులో మరిన్ని భారీ పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పార్టీ సీనియర్ నాయకుడు కే ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కే రాకేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాదయ్య తదితరులు ఉన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నామని కమిషనర్ సత్యనారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ఉప్పరిగూడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు బోసుపల్లి వీరేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్‌పీ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన బాలమణి (57) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురువారం ట్రస్టు సభ్యులచే రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఫౌండేషన్ సభ్యులు నరేష్, మధు పాల్గొన్నారు.

రచయిత్రి శ్రీవల్లి రాధికకు ఓయూ డాక్టరేట్



వనస్థలిపురం: ప్రముఖ రచయిత్రి, వనస్థలిపురం కమలానగర్ కాలనీకి చెందిన టి.శ్రీవల్లి రాధికకు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'తెలుగు సాహిత్యం-భక్తిరసం' అన్న అంశంపై శ్రీవల్లి రాధిక ప్రొఫెసర్ డాక్టర్ పి.వారిజారాణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. ఎంఏ (తెలుగు) చేసిన శ్రీవల్లి రాధిక గత 20 సంవత్సరాలుగా పలు కథలను, నవలలను రచించారు. ఆమె రాసిన సాహిత్య విమర్శనా వ్యాసాలు, కవితా సంపుటాలు, పద్య కవిత్వం, బాల సాహిత్యం పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. గేయ రచనలు ఆకాశవాణిలో లలిత గీతాలుగా ప్రసారమయ్యాయి.ఆమె రచించిన కథలు, కథా సంపుటికిగానూ పలు సంస్థలు ఉత్తమ కథా రచయిత్రి పురస్కారాలు అందజేశాయి.

ప్రతి పైసాకు లెక్క ఉండాలి: ఎంపీడీఓ

యాచారం: పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఖర్చుచేసే ప్రతి పైసా రికార్డులో నమోదు చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండా గ్రామ పంచాయతీని గురువారం ఆమె సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పల్లె ప్రగతి పనుల్లో నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.

నర్సాయిపల్లిలో ఎంపీడీఓ పర్యటన

ఆమనగల్లు: ఎన్ఆర్ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలం నర్సాయిపల్లి గ్రామంలో గురువారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్సరీ, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. ఈజీఎస్ కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బారి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

13 మంది విద్యార్థినులకు ఇంటర్‌లో సీట్లు

ఇబ్రహీంపట్నం: గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షలో స్థానిక నల్లకంచె గురుకుల పాఠశాల నుంచి 13 మంది బాలికలు సీట్లు సాధించి హెచ్ఆర్ఆర్ ఈస్ట్ రీజియన్‌లో మొదటి స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ లీలావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొలిదొడ్డి జూనియర్ కళాశాలలో 11, నార్సింగిలో రెండు సీట్లు విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. ఇందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను, సీట్లు సాధించిన విద్యార్థినులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు.

చెన్నారంలో కంటివెలుగు శిబిరం ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారంలో సర్పంచ్ స్వప్న గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవలని సర్పంచ్ కోరారు. శిబిరంలో పలువురు గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైనవారికి రిఫర్ చేశారు. డాక్టర్ స్నేహ, ఏఎన్ఎం రాజేశ్వరి, వార్డుసభ్యులు మల్యానాయక్, జ్యోతి, సునీత పాల్గొన్నారు.

పడకల్‌లో ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌లో ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేశవరెడ్డి సూచించారు. కాగా శిబిరంలో 396 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీలు జోగు రమేష్, రఘునాయక్, ఉప సర్పంచ్ యాదమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, జగ్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యసాధన



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం వైష్ణవీగార్డెన్‌లో కార్తీకేయ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచే జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యం పెట్టుకుని దానిని చేరుకునే దిశగా ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగారెడ్డి, డైరెక్టర్లు చంద్రకాంత్, వెంకటేశ్‌గౌడ్, రాజేందర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహ



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: ఓబీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహ అన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. లక్ష్మణ్ పిలుపు మేరకు గురువారం మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు తుమ్మల రమేష్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ కమలానగర్‌లో పల్లె పల్లెకూ ఓబీసీ – ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఓబీసీల సంక్షేమం, సాధికారత, రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 2017లో ఓబీసీ క్రిమిలేయర్ ఆదాయాన్ని రూ. 6 లక్షల నుంచి 8 లక్షలకు పెంచిందన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలకు స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు బీ రాములు, సీ రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు పీ భిక్షపతిచారి, మీర్‌పేట ఉపాధ్యక్షులు సోమేశ్వర్, జీ మధు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

16న మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష

మహేశ్వరం: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 16న పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బీ ధనుంజయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు, అలాగే 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీల భర్తీకి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను WWW.teanfanamr.cff.gov.in వైబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.